ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

శనివారం 18 అక్టోబరు 2025

అగ్నివీర్ నియామకాలు పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్ 6

వీధికుక్కల దాడిలో 25 మందికి గాయాలు 6



కోటాకు.. టాటా

- రాష్ట్రవ్యాప్తంగా 2లక్షల బీపీఎల్ కార్డుల రద్దు
- 4.8 లక్షల లబ్ధిదారుల పేర్ల తొలగింపు
- అనర్హుల ఏరివేతకు సిద్ధమైన ప్రభుత్వం
- పలుశాఖల సమన్వయంతో జాబితా తయారీలో అధికారులు

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల నుంచే అనర్హత కలిగిన రేషన్ కార్డుదారులపై వేటు పడనుంది. అధికాదాయం, ఉద్యోగస్తులు, పన్నుచెల్లింపుదారుల కార్డుల కోటాను ప్రభుత్వం నిలిపివేయనుంది. బీపీఎల్ కార్డు ఉంటే చాలు ఉచిత వైద్యం, ప్రభుత్వ సంక్షేమాలు సులభంగా లభిస్తాయి. బీపీఎల్ కార్డు ద్వారా బియ్యం, చక్కెర మాత్రమే ప్రస్తుతం పంపిణీ అవుతోంది. ఈ రెండు వస్తువుల కోసం ఎవరూ వేచి చూడరు. కానీ బీపీఎల్ కార్డు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాకుండా వివిధ పథకాల ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులలోనూ ఉచిత వైద్యం పొందే వెసలుబాటు ఉంటుంది. పైగా ప్రభుత్వ ఆసుపత్రిలో అయితే ఎటువంటి రుసుం చెల్లించకుండానే ఎంతటి జబ్బుకైనా చికిత్సలు పొందవచ్చు. వీటితోపాటు ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ఐదు గ్యారెంటీలకు ఎటువంటి సందేహం లేకుండా మంజూరు చేస్తున్నారు. గృహలక్ష్మి, గృహజ్యోతి, అన్నభాగ్య, యువనిధి వంటి పథకాలు సులభంగా లభిస్తున్నాయి.

జనాభాకంటే అధిక కార్డులు

రాష్ట్రంలో జనాభాకంటే రేషన్‌కార్డులు కల్గినవారు ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల మంజూరు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. పైగా అనర్హులు పొందిన బీపీఎల్ కార్డులను రద్దు చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీపీఎల్‌కార్డులను రద్దు చేస్తే చెడ్డపేరు వస్తుందని వెనుకడుగు వేశారు. 2024 ఆరంభంలో ఇదే ఆలోచన వచ్చినా లోక్‌సభ ఎన్నికలు అడ్డు రావడంతో మరోసారి ఆలోచన విరమించారు. ప్రస్తుతం ఎటువంటి ఎన్నికలు లేకపోవడంతో అనర్హులకు ఉండే రేషన్‌కార్డులు రద్దు చేయాలని కసరత్తు సాగించారు. పౌర ఆహార సరఫరాలశాఖతోపాటు రెవెన్యూ విభాగం సమన్వయంగా రేషన్‌కార్డులలో సంస్కరించే ప్రక్రియ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించారని, 2 లక్షలకు పైగా బీపీఎల్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలోనే ఏపీఎల్ కార్డులుగా మార్పు చేశారు. తద్వారా 4.80 లక్షలమందికిపైగా పేర్లను తొలగించినట్టయ్యింది. రాష్ట్రంలో అమలులో ఉన్న బీపీఎల్‌కార్డులలో 7.76 లక్షలకుపైగా అనర్హులకు రేషన్‌కార్డులు ఉన్నాయని కేంద్రప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రప్రభుత్వం కుటుంబ గణాంకాల ప్రకారం 13.87 లక్షలకుపైగా అనర్హులకు రేషన్‌కార్డులు ఉన్నాయని వాటిని విడతలవారీగా రద్దు చేయాలని తీర్మానించారు. అనర్హ బీపీఎల్ కార్డులను రద్దు చేయడం ద్వారా అన్నభాగ్య పథకం లబ్ధిదారుల సంఖ్య తగ్గనుంది. అనర్హత ద్వారా బీపీఎల్ కార్డులను ఏపీఎల్‌కు మార్పు చేశారు. అర్హత ఉన్నా వివిధ కారణాలతో బీపీఎల్ కార్డు రద్దు అయితే 45రోజుల్లోగా అందుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ సమర్పించాలనే నిబంధన ఉంచారు. అధికారుల పరిశీలనలో బీపీఎల్ కార్డులకు అర్హులని నిర్ధారణ అయితే వారి కార్డును పునరుద్ధరణ చేస్తున్నారు.

వలసదారులకు లక్షల్లో కార్డులు

వివిధరాష్ట్రాలకు చెందినవారు బెంగళూరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా నివసిస్తున్నారు. ఉపాధి, కూలి పనులు, చిన్నతరహా వ్యాపారాలతోపాటు పలు పనులు చేసుకునేందుకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఇటువంటి వారిపైకి 57,864మంది నకిలీ బీపీఎల్ కార్డులను కలిగి ఉన్నట్లు గుర్తించారు. బోగస్ కార్డులను వెలికితీయడం ద్వారా నిత్యావసర వస్తువులను అనర్హులకు పంపిణీ చేయకుండా కట్టడి చేసినట్లు అవుతుంది. బీపీఎల్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశారు. ఇప్పటికే 75శాతం మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు. రేషన్‌కార్డు కల్గినవారంతా ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో ఎక్కువమంది ముందుకు రాలేకపోయారు. అయినా ఇప్పటివరకు 6,16,196 కార్డులు ఈ-కేవైసీ కాలేదని గుర్తించారు.

నిబంధనల ఉల్లంఘన వివరాలు	అనర్హకార్డులు
ఈ-కేవైసీ చేయనివారు	6,16,196
రూ.1.20 లక్షలకంటే ఆదాయం కల్గినవారు	5,13,613
ఇతర రాష్ట్రాలకు చెందినవారు	57,864
7.5 ఎకరాలకంటే ఎక్కువభూమి కల్గినవారు	33,456
6 నెలలుగా రేషన్‌పొందనివారు	19,893
వివిధ కంపెనీలలో డైరెక్టర్‌లు	19,690
రూ.25లక్షల వ్యాపారాలు చేసేవారు	2,684
మృతి చెందిన కుటుంబ సభ్యులు	1,446

పన్ను చెల్లింపుదారులపై వేటు తప్పదు

అనర్హత బీపీఎల్‌కార్డులను గుర్తించేందుకోసం ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లించేవారు, నిబంధనల కంటే ఎక్కువభూమి కల్గినవారిని గుర్తించారు. అటువంటి వారి బీపీఎల్‌కార్డులను రద్దు చేసి సంబంధిత రేషన్ డిపోలను పరిశీలించాలని జాబితాలను పంపారు. జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, పన్నులు చెల్లిస్తున్నవారు ఇతరత్రా స్థితిమంతులైనవారి వివరాలను నివేదిక రూపంలో పంపారు. రేషన్ డీలర్లు, రెవెన్యూ, పౌర ఆహార సరఫరాలశాఖ అధికారులు సమన్వయంగా అనర్హులు పట్టుబడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో ఎక్కువమంది బీపీఎల్ కార్డులనుంచి బయటపడేందుకు సుముఖత చూపారు. అనర్హత కార్డులను గుర్తించేందుకు అధికారులు పలు నిబంధనలు విధించారు. బ్యాంకు రుణం కోసం ఐటీ రిటర్న్స్ సమర్పించేవారు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో పిల్లల ఆదాయం అధికంగా ఉండడం పాన్, ఆధార్‌లను పరిశీలిస్తే ఐటీ చెల్లిస్తున్నట్లు తేలడంతో అటువంటి బీపీఎల్ కార్డులను రద్దు చేశారు. ఇదే విషయాన్ని పౌర ఆహార సరఫరాల శాఖ జాయింట్ డైరెక్టర్ కుముద తెలిపిన మేరకు నెలరోజుల వ్యవధిలో 2లక్షల బీపీఎల్ కార్డులను ఏపీఎల్‌గా మార్చామన్నారు. అనర్హుల కార్డులను తొలగించే ప్రక్రియ నిరంతరంగా సాగనుందన్నారు.



రైతు మహదేవ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఎం

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

- పులి దాడిలో గాయపడిన రైతు కుటుంబానికి సీఎం సిద్దరామయ్య హామీ

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు.. అండగా ఉంటామంటూ సీఎం సిద్దరామయ్య.. రైతు కుటుంబానికి హామీ ఇచ్చారు. మైసూరు జిల్లా సరగూరు తాలూకా బడగలాపురలో పులి దాడి ఘటనలో గాయపడిన రైతు మహదేవ్‌కు సంపూర్ణ వైద్యం ఖర్చులు భరిస్తామని సీఎం సిద్దరామయ్య హామీ ఇచ్చారు. శుక్రవారం మైసూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహదేవ్‌ను ఆయన పరామర్శించి కుటుంబ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మహదేవప్ప ఇతర అధికారులు ఉన్నారు. పులిదాడిలో రెండుకళ్లు కోల్పోయినట్టేనని వైద్యులు తెలిపిన మేరకు పరిహారంతోపాటు వైద్యఖర్చులు పూర్తిగా చెల్లించాలని జిల్లా అధికారిని సూచించారు. అటవీప్రాంతానికి అనుబంధమైన ప్రదేశంలో పులిని బంధించేందుకు సాగుతున్న కూంబింగ్ వేళ గురువారం రైతుపై పులి దాడి చేయడం కలకం రేపింది.

వ్యాపారిని కడతేర్చిన కిడ్నాపర్లు

- ఫోన్ చేసి రూ.కోట్లు డిమాండ్
- స్పందించకపోవడంతోనే హత్య
- తుంభద్రలో మృతదేహం లభ్యం
- ఇద్దరు నిందితుల అరెస్ట్ 6



మంజునాథ్ (ఫైల్)

మహిళలు ఒనకె ఓబవ్వ స్ఫూర్తితో సాగాలి

- కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ పిలుపు
- కూడ్లిగిలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో మంత్రి నిర్మలా సీతారామన్, ఎంపీ తుకారం, కలెక్టర్ జాహ్నవి తదితరులు

బళ్లారి/గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యంలో ఒకవైపు పచ్చని సశ్యసామల ప్రాంతం ఉండగా... మరో వైపు వర్షాలు లేక బీడు భూములు ఉన్నటువంటి కూడ్లిగి ప్రాంతం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. కూడ్లిగి తాలూకాలో శుక్రవారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల ప్రధాన వ్యాపారంగా ఉన్న చింతపండు, వేరెశెనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో అతి తక్కువగా వర్షం కురిసే ప్రాంతంలో కూడ్లిగి ప్రాంతమని, అలాంటి ప్రాంతంలో మహిళ ఆర్థికాభివృద్ధి కోసం చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌ను నాబార్డ్ ఆర్థిక సహాయంతో ప్రారంభించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో మరిన్ని యూనిట్లు ప్రారంభిస్తామన్నారు. అటవీశాఖ అధికారులు లక్ష చింత మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, అందుకు అవసరం అయ్యే సీఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ప్రాంతంలో సమాజాన్ని పట్టి పీడిస్తున్న దేవదాసి పద్ధతికి ద్వారా ఈ ప్రాంతలో ఎన్నో కుటుంబాలు అంతరించి పోయాయని, ఆ పరిస్థితి పునరావృతం కాకుండా. వారి పిల్లలకు విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు జిల్లా పాలనా మండలి కృషి చేయాలని సూచించారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో ఆయా ప్రాంతాలకు అనుగుణంగా 7 ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేసినట్లు, ప్రస్తుతం నాలుగు ప్రారంభించినట్లు, వచ్చే వారం మరో మూడు జిల్లాలో మూడు ప్రారంభిస్తామన్నారు. దేశ ప్రధాని రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నారని, బీజేపీ ప్రభుత్వ ఉన్నా, లేకున్నా..ప్రజల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించినట్లు తెలిపారు. మనమంతా భారత ప్రజలమనే ఉద్దేశంతో ప్రభుత్వ ఫలాలు అందరికి అందాలనే ఆకాంక్ష ప్రధాన మోదీ కలిగి ఉన్నారన్నారు. గర్భిణుల సంక్షేమం, ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రధాని మోదీ ఎన్నో పథకాలు అమలు జరుగుతున్నాయని, వాటి ఫలాలు నేరుగా ప్రజల వద్దకే చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ భాగంలో మహిళలు ఒనెకె ఓబవ్వ స్ఫూర్తితో ముందుకు నడవాలని, ఎవరో వచ్చి.. ఏమో చేస్తారనే భావన వదిలి తమకు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ముందుకు ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ట్రైబల్స్ ఉన్నట్లు గుర్తించానని, వారిందరికి విద్య అందించేందుకు ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రైతులను సంక్షేమ పథకాల గురించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చిన్నరైతులను దృష్టిలో ఉంచుకుని కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రవేశ పెట్టిందని, కిసాన్ అంటే కేవలం రైతలే కాదని, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, పందుల పెంపకం దారులు, పాడిపరిశ్రమ దారులు కూడా కిసాన్ క్రెడిట్ కార్డు పరిధిలోకి వస్తారనే విషయం ప్రజలు తెలుకుకోవాలని, ఈ ప్రాంతంలో లీడ్‌గా ఉన్న ఎస్‌బీఐ అధికారులు కూడ్లిగి తాలూకాలో కిసాన్ క్రెడిట్ కార్డు పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరికి కెసిసి అందేల్లా జిల్లా పాలనా మండలి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తాలూకాలో 21,372మంది కిసాన్ కార్డులు ఉన్న రైతులు ఉన్నారని, ప్రతి రైతుకు రూ 6వేలు చొప్పునా నేరుగా రైతుల అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ తుకారం, విజయనగరం కలెక్టర్ కవిత మణికేరి, విజయనగరం ఎస్పీ జాహ్నవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతారామన్

ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి భద్రత కల్పించండి

- నగర పోలీస్ కమిషనర్‌కు బీజేపీ వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బసవనగుడిలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం కేశవకృప ఎదుట యూత్‌కాంగ్రెస్ నిరసన తెలిపిందని, ఇటువంటి పరిణామాలు సమంజసం కాదని, కార్యాలయానికి తగిన భద్రత కల్పించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, రామమూర్తితోపాటు రవికుమార్, భరత్‌శెట్టి తదితరులు నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ఎస్‌కు వందేళ్లు పూర్తైన సందర్భంలో ఏడాదిపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టదలిచామన్నారు. ఆర్ఎస్ఎస్‌కు సంబంధించి మీడియాతో చర్చకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదని, నిరసనలు తెలిపితే పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ ప్రత్యేకదృష్టితో సమస్యను పరిశీలించాలన్నారు.

ఎస్కార్ట్ తొలగింపుపై చలవాది ఆగ్రహం

కాగా బీజేపీ కార్యాలయంలో పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ నాకు ఏదైనా జరిగితే ప్రియాంక ఖర్గే కుటుంబానిదే బాధ్యత అన్నారు. ప్రతిపక్షనేతకు కల్పించిన ఎస్కార్ట్ రక్షణ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. నన్ను టార్గెట్ చేయాలనే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. కారుతోపాటు ప్రతిపక్షనేతకు ఉండే ఇతర సౌలభ్యాలను వాపసు చేస్తానన్నారు. ఎస్కార్ట్ తొలగింపుపై సీఎం, హోం మంత్రులు సమాధానం చెప్పాలన్నారు. నా వెనుక నా సమాజం ఉందని, ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఉందన్నారు. కానీ ఎస్కార్ట్ తప్పించి మంత్రి ప్రియాంక ఖర్గే, మహదేవప్పలకు భద్రత పెంచారన్నారు. వారి భద్రత పెంచడంలో మాకు అభ్యంతరం లేదని, కానీ ప్రతిపక్షనేతకు ఉన్న ఎస్కార్ట్ తొలగింపు సరికాదన్నారు. దళిత సంఘర్ష సమితి పోరాటాల ద్వారా వచ్చామని, ఖర్గే కుటుంబ సభ్యులు ఎప్పుడైనా ఏదైనా పోరాటం చేశారా...? అంటూ సవాల్ చేశారు. పుట్టుకతోనే బంగారం స్పూన్‌తో పుట్టారని, దళితుల కష్టాలే తెలియవన్నారు.

ఓటుచౌర్యంపై దర్యాప్తు చేయండి: కట్టా జగదీశ్

రాజకీయ ప్రచారం కోసం ఆరోపణలు చేయడం కాదని, హెబ్బాళ్ నియోజకవర్గంలో ఓటు చౌర్యం జరిగిఉంటే దర్యాప్తు జరిపించాలని బీజేపీ నేత కట్టా జగదీశ్ డిమాండ్ చేశారు. మంత్రి బైరతి సురేశ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్నికలు జరిగిన 30 నెలల తర్వాత మంత్రికి జ్ఞానోదయం అయ్యిందన్నారు.

ఆర్ఎస్ఎస్ ర్యాలీలో పాల్గొన్న పీడీఓపై సస్పెన్షన్ వేటు

రాయచూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరులో ఇటీవల జరిగిన ఆర్ఎస్ఎస్‌రోడ్‌షోలో పాల్గొన్నందుకు పీడీఓ, లింగసుగూరు ఎమ్మెల్యే మానప్ప వజ్జల్ సన్నిహితుడు ప్రవీణ్ కుమార్ సస్పెండ్‌కు గురైయ్యారు. ప్రవీణ్ కుమార్ విచారణను రిజర్వ్ చేస్తూ పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ నియామక క్రమశిక్షణాధికారి డాక్టర్ అరుంధతి చంద్రశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో సిరవార తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారి(పీడీఓ) ప్రవీణ్ కుమార్ గణేష్ వేషధారణ ధరించి, చేతిలో కర్ర పట్టుకుని పాల్గొన్నారు. ఇది సోషల్ మీడియాలో పత్రికల్లో వైరల్ అయ్యింది. దీనిని ప్రస్తావిస్తూ, కర్ణాటక సివిల్ సర్వీసెస్(ప్రవర్తన) నియమాలు 2021లోని నిబంధన 3 ప్రకారం, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన విధుల నిర్వహణలో నైతికంగా ఉండాలి, రాజకీయంగా తటస్థంగా ఉండాలని, తన విధికి విరుద్ధంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.




ప్రవీణ్‌కుమార్

పది కిలోమీటర్ల మేర క్యూలైన్లు..

- హాసనాంబ దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు
- ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టిన అధికారులు



భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు



బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హాసన్‌లో కొలువైన హాసనాంబ దేవిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం రోజు సాధారణం కంటే భక్తులు ఎక్కువగా వచ్చారు. రూ.1000, రూ.300 టిక్కెట్ దర్శనం సుమారు 5 కిలోమీటర్ల మేర ఉంది. సర్వదర్శనం 10 కిలోమీటర్ల ఉండడం గమనార్హం. గతంలో ఎన్నడూలేనంతగా భక్తులు తరలివస్తున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. గురువారం ఉదయం వరకు 11.30 లక్షలమంది అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. బుధవారం ఒక్కరోజే 2.46 లక్షలమంది దర్శించుకున్నారన్నారు. సర్వదర్శనం, 300 రూపాయల దర్శనంకోసం ఏర్పాటు చేసిన బ్యారికేడ్‌లను అధిగమించి క్యూలైన్‌లు ఉన్నాయన్నారు. భక్తులు ఊహించినదానికంటే అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో వారి నియంత్రణ పోలీసులకు సవాల్‌గా మారింది. అయినా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

ఆరున్నర గంటలపాటు దర్శనం బంద్

రెండురోజుల్లో ఆరున్నర గంటలపాటు దర్శనం ఉండదు. 18న శనివారం మధ్యాహ్నం 2 నుంచి 3.30వరకు దర్శనం ఉండదు. అలంకరణ మార్పు, నైవేద్యం కోసం శనివారం అర్ధరాత్రి 12 గంటలనుంచి ఆదివారం తెల్లవారుజామున 5 వరకు దర్శనానికి అవకాశం ఉండదు. కాగా 21న మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి 3.30 వరకు దర్శనానికి అవకాశం ఉండదు. రాత్రి 12 నుంచి బుధవారం తెల్లవారుజామున 5 వరకు దర్శనానికి ఉండదని ప్రజలు, భక్తులు సహకరించాలని జిల్లాధికారి లతాకుమారి తెలిపారు. ఈ రెండు రోజుల్లో రాత్రి 10 గంటలకే భక్తులను క్యూలో పంపడం ఆపేస్తామని, క్యూలలో ఉన్నవారు 12వరకు దేవీ దర్శనానికి అవకాశం ఉంటుందన్నారు. తదుపరి అర్ధరాత్రి 12నుంచి తెల్లవారుజాము 5వరకు నిర్బంధం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.



అలరించిన కల్చరల్ ఫెస్టివల్

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైవిధ్యత నుంచి దైవత్వం వరకు అనే నినాదంతో వన్ వరల్డ్ - వన్ ఫ్యామిలీ వరల్డ్ కల్చరల్ ఫెస్ట్ అలరించింది. చిక్కబళ్లాపుర జిల్లా సత్యసాయి గ్రామంలో శుక్రవారం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో మధ్య ప్రాచ్య, ఆగ్నేయ ఆసియా, యూరోపియన్ దేశాల ఐక్యతకు చాటేలా పరిపూర్ణమైన ప్రదర్శనలు కొనసాగాయి. వివిధ దేశాల కళాకారుల ప్రదర్శనక ఆకట్టుకుంది. కల్చరల్ ఫెస్ట్‌లో థాయ్‌ల్యాండ్, నేపాల్, ఇండోనేషియా, ఫ్రాన్స్, స్వీడన్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. చెన్నైలోని ఫిలిప్పీన్స్ గౌరవ కాన్సుల్ బీమ్‌సింగ్ నరేంద్రన్, ఫిలిప్పిన్స్ గణరాజ్య రాయబార కార్యాలయం మూడో కార్యదర్శి రాన్‌బౌటిస్ట, కర్ణాటక వియత్నాం గౌరవాన్విత కాన్సులేట్ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

కాడ సిద్దేశ్వరస్వామి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు 7

పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగుల నిరసన



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.98	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7.624	24,465
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,508	25,189
నీటి నిల్వ (టీఎంసీలు)	79.73	101.50

రైతులకు బ్యాంకులు సహకరించాలి

● రుణ మంజూరులో ఇబ్బందులు తొలగించాలి ● బ్యాంకర్లతో సమావేశంలో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిర్మలా సీతారామన్

బళ్లారి సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను వివిధ రుణ పథకాల ద్వారా బ్యాంకులు ప్రోత్సహించాలని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం పురోగతిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. కర్ణాటక బ్యాంక్‌మే 1నుండి వన్‌స్టేట్ -వన్ గ్రామీణ బ్యాంకు ప్రక్రియ కింద ఉనికిలోకి వచ్చింది.ఇది దేశంలో 3వ అతిపెద్ద గ్రామీణ బ్యాంకు. ఆర్థిక కార్యాకలాపాల ద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధిని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని, గ్రామీణ బ్యాంకులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రతిరూపాన్ని మార్చేశక్తి గ్రామీణ బ్యాంకులను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ శ్రీకాంత్ బండివాడ, కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముజుందార్, సెక్రటరీ మనోజ్, డైరెక్టర్ సుశీల్ సింగ్, కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్, మహమ్మద్ హారీస్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

తమ డిమాండ్లు పరిష్కారించాలని మంత్రి సీతారామన్‌కు భారతీయ మజ్దూర్ సంఘం(బిఎంఎస్) అనుబంధ కర్ణాటక గ్రామీణ బ్యాంక్ అధికారుల సంఘం (కేఏజీబీఓఓ) ,కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘం (కేఏజీబీడబ్ల్యూఓ) తరపున, కర్ణాటక గ్రామీణ బ్యాంక్ అధికారులు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా కర్ణాక గ్రామీణ బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్, అయన బృందం తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రితో అల్లం వీరభద్రప్ప, గాలి సోమశేఖర్‌రెడ్డి

తీరనున్న రైతుల కష్టాలు

● ప్రాసెసింగ్ యూనిట్ ఎంతో ఉపయోగకరం
● మంత్రితో భేటీ అయిన జిల్లా నేతలు

బళ్లారి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక లోని బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, యాదగిరి, కలబుర్గి,బీదర్ ఏడు జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసిసింగ్ యూనిట్లు ఏర్పాటు తో రైతులకు ఎంతో మేలు జరగనుందని, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో అన్నారు. శుక్రవారం బళ్లారిలోని ప్రభుత్వ అతిథి గృహంలో వీరు మంత్రిని కలిసి మాట్లాడారు. బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలో తుంగభద్ర డ్యాం నీరు ద్వారా పండించే ఎండమిరప దేశంలోనే ప్రాముఖ్యత ఉందన్నారు. ఇంతక ముందు ఇక్కడ రైతుల పండించిన మిరప పంట అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడేవారని, ప్రాసెసింగ్ యూనిట్‌తో వారి కష్టాలు తీరనున్నాయన్నారు. అలాగే ఇక్కడ వరి, పత్తి, రాగి, జొన్న, చెరుకు లాంటి పంటలు కూడా రైతులు పండిస్తున్నారని వారికి సహకరించాలన్నారు. వారికి మద్దతు ధర అందించి ఆదుకోవాలన్నారు.

వ్యాపారిని కడతేర్చిన కిడ్నాపర్లు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు హతమార్చిన సంఘటన కలకలం రేపింది. విజయనగర జిల్లాలో ఈ నెల 10వ తేదీన కిడ్నాప్‌క్ గురైన బంగారు వ్యాపారి మంజునాథ్ శేజవాడకర్(58) మృతదేహం హూవినహడగలి తాలూకా హొళలు గ్రామ శివారులో తుంగభద్ర నదిలో కుళ్ళిపోయిన స్థితిలో తేలింది. ఈ ఘటనకు పాల్పడిన నిందితులు హొళలు గ్రామానికి చెందిన మల్లికార్జున ఉజ్జమ్మనవర్, యోగేష్ అంగడి అనే ఇద్దరు వ్యక్తులు పోలీసులు మహారాష్ట్ర పునేలో అరెస్టు చేశారు. బుధవారం రాత్రి నిందితులకు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడగా వారిచ్చిన సమాచారంతో తుంగభద్ర నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మంజునాథ్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంజునాథ్ కిడ్నాపర్లు కాళ్ళుచేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్ అతికించి కారు డిక్కిలో వేసి రోజంతా రాణిబెన్నూరు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో సంచరించారు. ఈ సమయంలో మంజునాథ్ ఊపిరి ఆడక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని శుక్రవారం రాత్రి హరవి వంతెన వద్ద నదిలో పడేసినట్లు కిడ్నాపర్లు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో నోరు విప్పారు. పోలీసులు తెలిపిన సమాచారంతోనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు.

ఏం జరిగిందంటే..

ఈ నెల 10వ తేదీన మైలార రోడ్డులో ఉదయం వాకింగ్‌కు వెళ్ళిన మంజునాథ్ శేజవాడకర్‌ను నిందితులు కిడ్నాప్ చేశారు. అనంతరం దావణగెరలో ఉన్న వైద్యురాలిగా పనిచేస్తున్న మంజునాథ్ సోదరి డాక్టర్ మంజుళా శేజవాడకర్‌కు వాట్సప్ కాల్ చేసి రూ.5కోట్లు డిమాండ్ చేశారు. అయితే అంతపెద్ద మొత్తం కాదని చెప్పడంతో కిడ్నాపర్‌లు మంజునాథ్‌ను హత్యచేస్తామని బెదిరించారు. విషయం సోదరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కిడ్నాపర్లు ఫోన్ చేయలేదు. ఈ మేరకు హిరేహడగలి పోలీసులు కేసు నమోదు చేసేంత వరకు మంజునాథ్ బతికే ఉన్నట్లు, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందనే విషయం తెలుసుకున్న కిడ్నాపర్లు భయపడి కిడ్నాప్ చేసిన వ్యక్తిని కారు డిక్కీలో దాచిపెట్టే ప్రయత్నం చేశారు. దీంతోనే మంజునాథ్ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మంజునాథ్ బంగారు వ్యారం వదిలి స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టే విభాగంలో అప్రైజర్‌గా పని చేశావారు. ఇతడికి భార్య, 9, 4వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కిడ్నాప్ చేసిన నిందితుల నుండి పోలీసులు మరింత సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

అగ్నివీర్ నియామకాలు పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చే నవంబరు 4నుంచి 11వరకు జిల్లా జరుగుతున్న అగ్నివీర్ సైనిక నియామకాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం నగర కలెక్టర్ కార్యాలయ కేస్వాన్ సభాగంగణంలో ఏర్పాటు చేసిన అగ్నివీర్ సైనిక నియామకం గురించి ముందస్తూ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. నగరంలో నల్లచెరువు ప్రాంతంలోని జిల్లాస్టేడియంలో జరగుతున్న సైనిక నియామక ర్యాలిలో ఏవిధమైన లోపాలులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ కమిటీ అధికారులు తగిన విధంగా పర్యవేక్షించాలని, ఎవరికి వారు విధులను క్రమశిక్షణతో నిర్వర్తించాలన్నారు. సైన్య నియామకానికి సంబంధించి ఇదొక ప్రత్యేక ర్యాలీ జిల్లాలో జరుగుతున్నది. మన జిల్లా విద్యార్థి, యువజనులకు సూర్తి అభించే స్థలం విజయవంతంగా జరగడానికి అన్ని శాఖల సహకారం తప్పనిసరి అన్నారు. పోలీస్ శాఖలో సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వేదిక, ఆసన వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ ,మైదానంలో బ్యారికేడ్ వ్యవస్థ, విద్యుత్ దీప జనరేటర్ వ్యవస్థ, కుర్చీలు,టేబుల్స్‌మైక్‌సెట్, టెలిఫోన్ సాంకేతిక వ్యవస్థ అచ్చుకట్టుగా చేయాలన్నారు. అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన, అర్హతలు తదితరవాలిలో లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అదనపు పోలీసు ఉన్నతాధికారి నవీన్‌కుమార్, జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్‌బాబు, సైనిక నియామక అధికారులు కర్నల్ వివేక్ జమీందార్,మేజర్ కపిల్, సహా బిఎస్ఎల్, అగ్నిమాపక, ప్రజపనుల శాఖ అధికారులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్రప్రసాద్

25 నుంచి టేబుల్ టెన్నిస్ టోర్నీ


టెన్నిస్ కోచ్ శివానంద

బళ్లారిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సువర్ణ బళ్లారి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అక్టోబరు 25, 26 తేదీల్లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనుంది. బళ్లారిలోని ఎస్పీ సర్కిల్ సమీపంలోని జిమ్ములో రాష్ట్ర స్థాయి వెటరన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తుందని టెన్నిస్ కోచ్ శివానంద తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ టోర్నమెంట్లో పాల్గొనాలనుకునే వారు అక్టోబరు 21 సాయంత్రం 5 గంటల వరకు సువర్ణ బళ్లారి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కోచ్ శివానందను తన మొబైల్ నెంబర్ 8105304949 సంప్రదించవచ్చు. టోర్నమెంట్ అక్టోబరు 25 ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. టోర్నమెంట్ సమన్వయ కర్తలు జగదీష్, బీదర్, కోటి, శివకుమార్, ఎం సందీప్, కేఎస్‌ఉదయ్ శంకర్ రావు, గోపినాథ్ డీపీ నిర్వహిస్తారు. శనివారం 25న 60 యేళ్ల పైబడిన మహిళలు, పురుషులు సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లో జరుగుతాయి. ఆదివారం 26న 40 పైబడిన పులిసిన ఓపెన్ డబుల్స్ టోర్నమెంట్ జరుగుతుంది.

వీధికుక్కల దాడిలో 25 మందికి గాయాలు

రాయచూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఖూని మస్జీద్, తిమ్మాపూర్‌పేట, బేరూన్‌కిల్లాతో పాటు 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో 25 మందికి పైగా వీధికుక్కలు దాడి చేశాయి. గురువారం సాయంత్రం నడకకు వెళుతున్న వారి పై, రాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న వారి పై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేస్తున్నాయి. దీనివల్ల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఒంటరిగా నడవలేకపోతున్నామనినివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. కుక్కల దాడికి గురైన వారిలో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. ఇంటి ముందు ఆడుకుంటున్నపుడు లేదా బయట నడుస్తున్నప్పుడు కుక్కలు దాడి చేసిన సంఘటనలు నమోదయ్యాయి. గతంలో వీధికుక్కల కారణంగా ఒకే రోజు 15 మందికిపైగా గాయపడ్డారు. ఆ సమయంలో, కుక్కలను పట్టుకోవడానికి రాష్ట్ర వెలుపల నుంచి ఒక ప్రత్యేక బృందాన్ని పిలిపించారు. అప్పుడు కొంతకాలంగా శాంతి నెలకొని ఉన్నప్పటికీ, ఇప్పుడు కుక్కల బెడద మళ్ళీ మహానగర కార్పొరేషన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. శుక్రవారం ఎస్‌డీపీఐ జిల్లా యూనిట్ కార్యకర్తలు రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి బాధితులను ఓదార్చారు. వీధి కుక్కల దాడిలో గాయపడిన వారికి ప్రభుత్వం ఉచిత చికిత్స, పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని వారు జిల్లా యంత్రాంగాన్ని కూడా కోరారు. ఈ సందర్భంగా మహ్మద్ షఫీ, ముష్తాక్ అహ్మద్ తదితరులు ఉన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

రూ.24వేల నగదు ప్రయాణికుడికి అందజేత


నగదును సత్యనారాయణకు అప్పగిస్తున్న డ్రైవర్ శ్రీకాంత్

కంప్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బస్సులో పని చేసే డ్రైవర్ నిజాయితీని చాటుకున్నారు. కంప్లికి చెందిన బస్సు డ్రైవర్ శ్రీకాంత్ బస్సులో రూ. 24 వేలు నగదు, ఏటీఎం కార్డులు, ముఖ్యమైన పత్రాలతో కూడిన తన పర్సును మరిచిపోయిన ప్రయాణికుడికి పర్సును సురక్షితంగా తిరిగి ఇచ్చారు. తాను ఆదర్శవంతమైన డ్రైవర్ అని నిరూపించుకున్నారు. ఒక ప్రైవేటు కంపెనీ డైరెక్టర్ అయిన కేవీ సత్యనారాయణ గురువారం తెల్లవారుజామున కేకేఆర్టీసీ కొప్పాల్ డివిజన్‌లోని గంగావతి డిపో చెందిన విజయవాడ, గంగావతి బస్సులో ప్రయాణిస్తున్నాడు. రాయచూరు జిల్లాలోని నీర్మనావి గ్రామంలో తెల్లవారు జామున గ్రామంలో దిగి గ్రామం చేరుకున్నారు. తరువాత తన పర్సును బస్సులోనే మర్చిపోయారు. ఆందోళన చెందిన ప్రయాణికులు వెంటనే బస్సు డ్రైవర్ శ్రీకాంత్‌కు ఫోన్ సమాచారం అందించారు. వెంటనే స్పందించిన డ్రైవర్ బస్సులోపల తనిఖీ చేయగా సీటు కింద ఒక పర్సు కనిపించింది. పర్సులో రూ. 24 వేలు నగదు, ఏటీఎం కార్డులు, అనేక పత్రాలు ఉన్నాయి. ఆ తరువాత అతను అధికారులకు సమాచారం అందించారు. ప్రయాణికులు సింధనూరు ట్రాఫిక్ కంట్రోలర్ శశిధర్ పాటిల్ సమక్షంలో పర్సును తిరిగిచ్చాడు. కేకేఆర్టీసీ అధికారులు, సహచరులు, ప్రయాణికులు, డ్రైవర్ శ్రీకాంత్ మానవత్వాన్ని చాటుకుని నిదర్శనంగా నిలిచారు.

హోసూరు జోన్


నూతన టేబుళ్లు, బెంచీలతో విద్యార్థులు

పాఠశాలకు కుర్చీలు, టేబుళ్ల అందజేత

హోసూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ 9వ వార్డులోని భారతీయార్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు ప్రైవేట్ ఆసుపత్రి తరపున టేబుళ్లు, కుర్చీలు విరాళంగా సమకూర్చారు. రెండు పాఠశాలలకు కలిపి సుమారు రూ.3లక్షల విలువైన ఫర్నీచర్ శుక్రవారం అందచేశారు. హోసూరు డీఎంకే యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్యలు పాల్గొన్నారు. విద్యార్థులకోసం చేసిన సమాజసేవను అభినందించారు. మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు కృష్ణప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

హోసూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని అడియమాన్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు కౌన్సెలింగ్ సెమినార్, శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలాజి ప్రకాశ్ అధ్యక్షత వహించారు. ఎంజీఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల తమిళవిభాగం ప్రొఫెసర్ సిరియార్ కృష్ణన్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని పరిష్కరించే అంశాలపై విద్యార్థులకు సలహాలు ఇచ్చారు. విభాగాధిపతులు బువియా రాసు, నాగరాజన్, సరళ, విద్య, ఉపాధ్యాయులు కల్విజయలక్ష్మి, జస్టినా తదితరులు పాల్గొన్నారు.

21నుంచి హంపి జూలో సందర్శకులకు అనుమతి


హోస్పేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): హంపి అటల్ బిహారీ వాజ్‌పేయి జూలాజికల్ పార్క్‌ను పర్యాటలకు వీక్షణ కోసం ఈనెల 21 ప్రారంబిస్తున్నట్లు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ రాజేష్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం జూను మూసివేస్తారు. అయితే దీపావళికి జూకు వచ్చే పెద్ద సంఖ్యలో పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని సెలువు దినాలలో జూ తెరచి ఉంటుంది, మరియు యధావిధిగా పని చేస్తుంది. జంతువులను వీక్షించడానికి కుటుంబాలు పెద్ద సంఖ్యలో జూకు రావచ్చని అన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్

వాల్మీకులు ఐక్యంగా జీవించాలి: ఎమ్మెల్యే

కంప్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి సమాజంలోని ప్రతి ఒక్కరు సమాజం అభివృద్ధికి ముందడుగు వేయాలని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. శుక్రవారం కంప్లి తాలుకా పరిధిలోని రామసాగరం గ్రామంలో వాల్మీకి జయంతి వైభవంగా ఇచ్చే పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్ పాల్గొని తెలిపారు. ఉదయం ముత్తయిదువ మహిళలు కలశాలతో వాల్మీకి మహర్షి భావచిత్రపటాన్ని భాజభజంత్రీల మధ్య గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే సదుపాయాలు సద్వినియోగపరచుకోవాలి. ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. ప్రతి ఇంటి పిల్లలకు విద్యాభ్యాసం కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ఇండ్లలో వుండే మహిళలు స్వశక్తితో ముందుకొచ్చి కుటుంబానికి అండగా వుండాలని తెలిపారు. వృత్తి పరంగా పనులకే నిమిత్తంగా కాకుండా పిల్లల్ని పాఠశాలకు పంపించాలన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు జయంతిని వైభవంగా జరుపుకుని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఆశ, నారాయణప్ప, మంజునాథ్, గోపాల్, శివ, శంకర్ గౌడ, వీరేష్, ఉలగప్ప, వెంకటేష్, హనుమంతు, వెంకటేష్ బర్మక్క, మరిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం


నడివి గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నడివి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రారంభించారు. శుక్రవారం సిరుగుప్ప తాలుకా జిల్లా పరిషత్ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చెందిన కార్యాలయాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రారంభించారు. పలు విభాగాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈఈ తిప్పేస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహ నాయక, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఉమ, సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు, సిద్దమ్మ, పవన్ కుమార్ దేశాయ్, గణేష్, పంచాయతీ సర్వసభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లించిన వారికే షాపులు

హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకుని తాత్కాలికంగా ఏర్పాటు చేసే బాణా సంచా దుకాణాలకు జీఎస్టీ చెల్లిస్తేనే కేటాయింపు జరుగుతుందని అధికారులు తెలిపారు. గత యేడాదివరకు షాపులు ఏర్పాటుచేసుకుని అమ్మకాలు జరిపే సమయంలో వాణిజ్య పన్నులశాఖ అధికారులు వెళ్లి షాపులవద్ద ట్యాక్స్ వసూలు చేసేవారు. ఈసారి ప్రభుత్వ నిబంధనలు మార్చడంతో ముందుగానే జీఎస్టీ చలానా చూపించిన వారికే షాపులు కేటాయిస్తామని అధికారులు తేల్చారు. హిందూపురం 91మంది దరఖాస్తు చేసుకోగా రూ.30వేలు చలానా తీయాలని చెప్పేసరికి ఆ సంఖ్య 40కు తగ్గింది. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గ పరిధిలో 200కుపైగా దరఖాస్తు చేసుకున్నారు. మండల కేంద్రాల్లో సైతం 15నుంచి 20వేలు చలానా తీయాలని కలెక్టర్ చెప్పారు. దీంతో శుక్రవారం సాయంత్రానికి ఈ మూడు నియోజకవర్గాల్లో 60మంది మాత్రమే చలానా తీశారు. ఇందులో 40హిందూపురం పట్టణంలోనే ఉన్నాయి.

టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కంప్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా పరిధిలోని ఉప్పరళ్లిలో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ టవర్ నెట్‌వర్క్‌కు సిద్దమవుతున్నట్లు మెట్రి గ్రామ పంచాయతీ సభ్యులు కుమారస్వామి తెలిపారు. శుక్రవారం ఉప్పరళ్లి గ్రామానికి బీఎస్ఎన్ఎల్ బళ్లారి ఏజీఎం శ్రీధర్, నెట్‌వర్క్ ఇన్‌ఛార్జిలు గణేష్, సతీష్ గ్రామస్తులతో టవర్ నెట్‌వర్క్ సిద్ధం చేయడానికి స్థలాలను పరిశీలించారు. మెట్రి గ్రామ పంచాయతీ సభ్యులు కుమారస్వామి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గ్రామంలో టవర్ లేక అందరూ చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకుని తాము ఎమ్మెల్యే గణేష్‌కు, ఎంపీ తుకారాంకు టవర్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన బీఎస్ఎన్ఎల్ అధికారులను ఉప్పరళ్లి పంపడంతో వారు టవర్ ఏర్పాటు చేస్తామనడం సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో పరశురాం, జగదీష్, నాగరాజు, దేవేంద్రప్ప, హనుమాన్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ద్వారా వివిధ ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. విజయనగరం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసక్తి గల నిరుద్యోగ యువతి, యువకులకు 31 రోజులపాటు మహిళా కుట్టు శిక్షణ, 13 రోజులు జూట్‌బ్యాగ్ శిక్షణ, 31రోజులు హ్యాండ్ ఎంబ్రాయిడరీ మరియు మెటీరియల్ పెయింటింగ్ ఆర్ట్‌కు, 31రోజులు గొర్రెల పెంపకం, 12రోజులు ట్రావెల్, టూరిస్ట్‌కు శిక్షణ ఇవ్వబడుతుంది. ఆసక్తి గల దరఖాస్తుదారులు విజయనగరం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఉండాలి. కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, వయోపరిమితి 18నుంచి 45 సంవత్సరాలు మధ్య ఉండాలి, దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మార్క్‌షీట్ జిరాక్స్ కాపీ, 3పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ప్రభుత్వ బాలికల ప్రీ-యూనివర్శిటీ కళాశాల క్యాంపస్, పైహోటల్ ఎదురుగా బస్టాండ్ సమీపంలో హోస్పేటలో సమర్పించాలి. నవంబరు 14న జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, 15న నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 9741987137, 6360467102, 9963471468 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొంచెం...

థామస్ అల్వా ఎడిసన్ (వర్ధంతి)



మానవజాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ వంటి ఉపకరణాలను ఆవిష్కరించిన థామస్ అల్వా ఎడిసన్ అమెరికా దేశం మిలాన్ ప్రాంతంలో 1847 ఫిబ్రవరి 11న జన్మించారు. సాధారణ ఫిలమెంట్ బల్బ్ ఆవిష్కర్తగా పేరొందినా ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్, మాస్ కమ్యూనికేషన్, సౌండ్ రికార్డింగ్‌కు సంబంధించిన ఉపకరణాలు ఫోనోగ్రాఫ్, మోషన్ పిక్చర్ కెమెరా వంటివి ఆవిష్కరించారు. దీంతో పారిశ్రామికరంగ చిత్రమే మారింది. ఆధునిక పరిశోధనా ప్రయోగశాలకు ఆద్యులుగా పేరొందారు. జాన్‌స్కాట్ మెడల్, ఎడ్వర్డ్ లాంగ్‌స్ట్రెంగ్త్ మెడల్, ఫ్రాంక్లిన్ మెడల్ తదితర గౌరవాలు అందుకున్నారు. 1093 వాటికి ఆయన పేరిట పేటెంట్‌లు ఉండడం ఒక రికార్డు. 1931 అక్టోబరు 18న కన్నుమూశారు.

ఓంపురి (జయంతి)



బాలీవుడ్ నటుడు 'పద్మశ్రీ' గ్రహీత ఓంప్రకాశ్ పురి (ఓంపురి) 1950 అక్టోబరు 18న పంజాబ్ రాష్ట్రం అంబాలాలో జన్మించారు. హిందీలో ఆయన నటించిన సినిమాలు జాతీయస్థాయిలో పేరొందాయి. బుల్లితెరపైనా రాణించారు. హిందీ ప్రధానమైనప్పటికీ బెంగాలీ, కన్నడ, ఇంగ్లిష్, పంజాబీ, గుజరాతీ, తెలుగు, మరాఠీ భాషల సినిమాలలో నటించారు. 2 జాతీయ, 2 ఫిల్మ్‌ఫేర్, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, ఇతర అవార్డులు పొందారు. అత్యధిక చిత్రాలు యుకె, యుఎస్‌లలో చిత్రీకరించడంతో 'ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్'లో గౌరవ అధికారిగా గుర్తింపు పొందారు. 2017 జనవరి 16న కన్నుమూశారు. మరణానంతరం ఆయన గౌరవార్థం అకాడమీ అవార్డును ప్రకటించారు.

బరగూరు రామచంద్రప్ప (పుట్టినరోజు)



ప్రముఖ కన్నడ సినీ దర్శకుడు, ప్రొఫెసర్, స్క్రీన్ రైటర్ బరగూరు రామచంద్రప్ప 1947 అక్టోబరు 18న కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా బరగూరు గ్రామంలో జన్మించారు. 30 ఏళ్ళలో పలు డాక్యుమెంటరీ సినిమాలు తీశారు. 1978లో 'ఒందు ఊరిన కథె'కు రాష్ట్ర ఉత్తమ కథా రచయిత అవార్డు పొందారు. కేవలం ఒక్క నటితో రూపొందించిన 'శాంతి' సినిమా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. పద్యాలు, చిన్న కథలు, నవలలు రాశారు. కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు, గౌరవ డాక్టరేట్‌లు, పుట్టణ్ణ కణగాళ్, ఇతర గౌరవాలు అందుకున్నారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ అధ్యయన కేంద్రంలో అధ్యాపకుడిగా, రాష్ట్ర పాఠ్యపుస్తకాల కమిటీ (కేటీబీఎస్)కి అధ్యక్షులుగా వ్యవహరించారు.

మార్టినా నవ్రతిలోవా (పుట్టినరోజు)



అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరొందిన మార్టినా నవ్రతిలోవా 1956 అక్టోబరు 18న చెకోస్లోవిక్‌లో జన్మించారు. వరల్డ్ నెంబరు 1గా సింగిల్స్, డబుల్స్‌లో 200వారాల పాటు నిలిచారు. 18 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్, 31 మేజర్ ఉమెన్స్ డబుల్ టైటిల్స్ (ఆల్‌టైమ్ రికార్డు), వింబుల్డన్‌లో ఉమెన్స్ సింగిల్స్‌లో 9సార్లు విజేత. 1975 నుంచి 2005వరకు టెన్నిస్‌లో ఆమె తన ఆధిపత్యం కొనసాగించారు. అనాథ బాలల సంక్షేమానికి, జంతువుల హక్కులకోసం పాటుపడ్డారు.

అమిష్ త్రిపాఠి (పుట్టినరోజు)



ప్రముఖ కాలమిస్ట్, రచయిత అమిష్ త్రిపాఠి 1974 అక్టోబరు 18న ముంబైలో జన్మించి ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలాలో పెరిగారు. ఆయన రాసిన 8 పుస్తకాలు 2020 నుంచి 5.5మిలియన్ కాపీలు అమ్ముడయ్యాయి. ది 'శివ ట్రిలాజి' పుస్తకం అత్యంత వేగంగా అమ్ముడైంది. లండన్‌లోని నెహ్రూ సెంటర్‌కు దేశం తరపున డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. జార్ఖండ్ రై యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఆయన నవలలు పలు భాషలలోకి అనువాదమయ్యాయి. 21వ శతాబ్దపు ఐకాన్ అవార్డు, లండన్ అలాగే 2022లో లెజెండ్ ఆఫ్ సుహల్‌దేవ్ పుస్తకానికి గోల్డెన్ బుక్ అవార్డు అందుకున్నారు.

జ్యోతిక (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటి జ్యోతిక 1977 అక్టోబరు 18న ముంబైలో జన్మించారు. ప్రత్యేకించి తమిళ సినీరంగంలో పేరొందినా తెలుగు, కన్నడ, మళయాళ భాషల సినిమాలలో నటించారు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. కలైమామణి, 3 ఫిల్మ్‌ఫేర్, 3 తమిళనాడు రాష్ట్ర సినిమా అవార్డులు, 4 దినకరన్ అవార్డులు పొందారు. భర్త, నటుడు సూర్యతో కలసి అగరం ఫౌండేషన్‌తో గ్రామీణ ప్రాంత పిల్లలకోసం విద్యాసేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

డీఈఓపై ఫిర్యాదు

పావగడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్పీ సంతకాలను ఫోర్జరీ చేసి రూ.10.47లక్షలు డీఈఓ యశోద కుమార్ తన భార్య పేరుపై బదలాయించినట్లు కోటగుడ్డం గ్రామపంచాయతీ పీడీఓ భవ్య వైఎన్‌ఎస్‌కోట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గత యేడాది జూలై నుంచి కోటగుడ్డం గ్రామ పంచాయతీ పీడీఓగా భవ్య విధులు నిర్వహిస్తోంది. 15వ ఆర్థిక ప్రణాళికలు పలు అభివృద్ధి పనులకు వెండర్ ద్వారా నిధులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ జాబ్ చార్ట్ ప్రకారం గ్రామ స్వరాజ్ నిధులను డీఈఓ యశోదకుమార్ ఎస్సార్ మార్కెట్ అని నమోదు చేసి ఆయన భార్య రిచా ఖాతాకు నగదును బదలాయించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగ నియమానుసారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మాళప్ప తెలిపారు.

బిళ్లూరు జనస్పందనలో 483 అర్జీలు

బాగేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బిళ్ళూరు గ్రామ పంచాయతీలో రెవెన్యూ, తాలూకా పంచాతీయ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన జనస్పందన సమావేశానికి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ సమస్యలపై 483 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎన్ఎన్ పత్రి, ఈఓ జీ రమేశ్‌లు పాల్గొని ప్రజల సమస్యలను ఆలకించారు. ఇదే సందర్భంగా 150మందికి పించను, పోడి 100, ఆశ్రయ 50, ఐదుగురికి సాగుచీటీలు అందచేశారు. వ్యవసాయశాఖ తరఫున అర్హులైన 50మందికి స్ప్రింక్లింగ్, పదిమందికి టార్పాల్‌ను పంపిణీ చేశారు. 21స్వసహాయ సంఘాలకు రూ.26.50 లక్షలు పంపిణీ చేశారు. 22మంది గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. 15మందికి భాగ్యలక్ష్మిబాండ్లు అందచేశారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో జనస్పందన నిర్వహిస్తున్నామని, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలు అర్హులు అందరికీ అందేలా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఇందులో కులం, మత బేధాలు ఉండవన్నారు. బాగేపల్లి, చేళూరు తాలూకాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. చేళూరు తాలూకాకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులను నియమించాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ జనస్పందన ద్వారా దళారీల బెడద ఉండదన్నారు.



జనస్పందనలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

సమావేశంలో ఈఓ జీవీ రమేశ్, తాలూకా క్షేత్ర విద్యాశాఖాధికారి ఎన్ వెంకటేశప్ప, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సీఎన్ సత్యనారాయణరెడ్డి, బిళ్ళూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలు నిర్మల, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాడ సిద్ధేశ్వరస్వామి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



మాట్లాడుతున్న లింగాయతమఠం స్వామీజీలు

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): లింగాయత మఠాధిపతులకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించాలనే కారణంతో కనేరి మఠాధిపతి కాడసిద్దేశ్వర స్వామిజీని విజయపుర జిల్లాలో ప్రవేశించకుండా జిల్లా అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 16న గురువారం నుంచి డిసెంబరు 14వ తేద వరకు 30రోజులపాటు నిషేధం విధించారు. శుక్రవారం స్వామిజీ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. కలబురగి హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ సచిన్ శంకర్ మగుదం ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ శశికిరణ్‌శెట్టి వాదనలు వినిపిస్తూ స్వామిజీకి భద్రత కల్పించాలనే లక్ష్యంతోనే విజయపుర ప్రవేశానికి నిషేధం విధించారన్నారు. వాస్తవానికి 17న శుక్రవారం సమర్థ సద్గురు సిద్దరామేశ్వర స్వామిజీ వర్ధంతిలో కాడసిద్దేశ్వర స్వామిజీ పాల్గొనాల్సి ఉండేది. మహారాష్ట్ర కొల్హాపుర జిల్లా కనేరి మఠాధిపతి కాడసిద్దేశ్వరమఠం స్వామిజీ ఈనెల 7న జత్త తాలూకాలోని బీలూరు గ్రామంలో జరిగిన ఓ సమావేశంలో లింగాయత మఠాధిపతుల కూటమి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. బసవసంస్కృతి అభియాన అనే నాటకాన్ని ప్రదర్శించారు. కర్ణాటక వ్యాప్తంగా నాటకబృందం తిరగాలని తద్వారా దేవుడు గుడిలో లేడని, గుడులకు వెళ్లరాదని ప్రచారం చేయాలని స్వామిజీ సూచించారు. ఈ విషయమై విజయపురతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వీరశైవ లింగాయతస్వామిజీలు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో వివాదం కావచ్చు నని నిషేధించినట్లు కోర్టుకు విన్నవించారు.

బహిరంగ క్షమాపణకు డిమాండ్

కాగా కెనేరి స్వామిజీని తప్పును బహిరంగంగా అంగీకరించి క్షమాపణలు చెప్పాలని లింగాయత మఠాల ఐక్యకూటమి డిమాండ్ చేసింది. బెంగళూరులో సానేహళ్ళి తరళబాలు శాఖ మఠాధిపతి పండితారాధ్య శివాచార్యస్వామిజీతోపాటు సిద్దేశ్వరమఠం శివానందమహాస్వామిజీ తదితరులు మీడియాతో మాట్లాడారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తమ వివిధశాఖలలోని ఖాళీలతో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని మైసూరు విశ్వవిద్యాలయం విద్యార్థులు డిమాండ్ చేశారు. పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ శుక్రవారం క్యాంపస్ సమీపాన మానసగంగోత్రి క్లాక్ టవర్ వద్ద భారీ నిరసన చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని రెండేళ్ల గడిచిందని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదని ఆరోపించారు. నిరసనలో పరిశోధకుల సంఘం మాజీ అధ్యక్షుడు శివశంకర్, దళిత విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పరిశోధకులు ప్రదీప్ ముమ్మడి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మైసూరు యూనివర్సిటీ విద్యార్థులు

గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో జిల్లా పంచాయతీ సీఈఓ డాక్టర్ నవీన్‌భట్ తదితరులు

» జడ్పీ సీఈఓ నవీన్‌భట్

శిడ్లఘట్ట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ స్థాయిలో గ్రంథాలయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల జ్ఞానార్జనకు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాలలో సమకూర్చాలని జిల్లా పంచాయతీ సీఈఓ డాక్టర్ నవీన్‌భట్ సూచించారు. తాలూకా పంచాయతీ సభాంగణంలో శుక్రవారం ఏర్పాటైన తాలూకాస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నవంబరు 8న గ్రామ గ్రంథాలయాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తాలూకా పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో డీసీపీ పన్ను వసూళ్ల పెంచాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక అరివు కేంద్రం, ఒక గ్రామ గ్రంథాలయం తప్పనిసరిగా ఉండాలన్నారు. కేడీపీ సభ, గ్రామసభ, వార్డు సభలు ఎప్పుడు నిర్వహించాలనేది ప్రతి నెలా 5వతేదీలోగా నిర్ధారించాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి అతీక్‌పాషా, ఈఓ హేమావతి, నరేగా సహాయ డైరెక్టర్ చంద్రప్ప, గ్రామపంచాయతీ పీడీఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇగ్నైట్‌మెరాకిలో యువత ఉత్సాహం

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇగ్నైట్‌మెరాకి 12వ విడత కెరీర్ ఫెస్ట్‌ను నిర్వహించింది. నగరంలోని కోర్ట్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో 10వేలమంది యువతీ యువకులు రిజిస్టర్ చేసుకోగా 2వేలమంది తుదిదశకు వచ్చారు. వెయ్యిమంది లైవ్ ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్‌లో భాగస్వామ్యులయ్యారు. ప్రత్యేక విన్యాసాలు, ఏఐ క్రియాశీలత, అన్వేషణ, చర్చాగోష్టిలతోపాటు పలు విభాగాలలో పోటీలు జరిగాయి. ఇగ్నైట్ మెరాకి ముఖ్యులు శరోద్‌సోమన్ మాట్లాడుతూ బెంగళూరులో దుర్గాపూజ వేదిక తరహాలో రూపొందించడం ఆకర్షణీయంగా ఉందన్నారు. ఏక్యా ఐటీపీఎల్‌కు ప్రథమస్థానం, ఏపీఎస్ కామరాజ్‌రోడ్డుకు ద్వితీయస్థానం, డీపీఎస్ ఈస్ట్, విబ్జియార్ హైస్కూల్‌లు సంయుక్తంగా తృతీయస్థానంలో నిలిచాయి.



విజేత జట్టు

తైక్వాండోలో దొమ్మసంద్ర విద్యార్థుల సత్తా

దొమ్మసంద్ర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో దొమ్మసంద్ర గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు రాణించి సత్తా చాటుకున్నారు. కోరమంగల ఇండోర్‌స్టేడియంలో పోటీలు సాగాయి. దొమ్మసంద్ర గ్రామంలోని మంజు టేక్వాండో అకాడమీ నుంచి ఆరుగురు పాల్గొన్నారు. వేర్వేరు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో గెలుపొందారు. విజేతజట్టును శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. మంజుమాస్టర్ మాట్లాడుతూ ఇటీవలికాలంలో యువత దురలవాట్లకు లోనవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠాలతోపాటు తమకు అభిరుచి కల్గిన క్రీడల్లో రాణించి సత్తా చాటుకోవడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సులభంగా అందుకోవచ్చునన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చక్కటి ఆరోగ్యం, దేహధారుడ్యం సాధ్యమన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

ఇద్దరు స్నేహితుల దారుణహత్య

» పెదనాన్న హత్యకు ప్రతీకారం

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెదనాన్నను హత్య చేసినవారిపై ప్రతీకారం తీర్చుకునే విషయంలో అన్నదమ్ములు ఇద్దరు స్నేహితులను రాళ్లతో దాడి చేసి హతమార్చారు. ఆదివారం రాత్రి శవాలవద్ద బీరుబాటిల్‌ను పెట్టారు. జంటహత్యలు విజయపుర తాలూకాలో సంచలనమయ్యాయి. పరారైన అన్నదమ్ములలో ఒకరిని పోలీసులు కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. జంటహత్యల విషయమై విజయపుర రూరల్ పోలీసులు తెలిపిన మేరకు కణ్బూరు గ్రామానికి చెందిన ఈరణగౌడ అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. గతంలో సాగర్ బెళ్తుంది (25), ఇజాక్ ఖురేషి (24) అనే ఇద్దరు కలసి ఈరణగౌడను బీరుబాటిళ్లతో కొట్టి హత్య చేశారు. ఆ తర్వాత వారిద్దరూ జైలుకు వెళ్లారు. ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. జైలునుంచి వచ్చిన తర్వాత కూడా ఈరణగౌడ కుటుంబీకులను రెచ్చగొడుతూ వచ్చారు. సత్తా ఉంటే మమ్మల్ని తాకాలని గ్రామంలో సవాల్ విసిరారు. గ్రామంలో హవా సాగించాలని ఇద్దరూ ఇలా ప్రవర్తించారు. ఇదే సందర్భంలోనే ఈరణగౌడ తమ్ముడి కుమారులు పెదనాన్న హత్య చేసినవారు బహిరంగంగా చాలెంజ్ చేస్తుండడంతో జీర్ణించుకోలేకపోయారు. సాగర్, ఇజాక్‌లు ఒకేబైక్‌పై తిరుగుతుండేవారు. ఇటీవల వారిద్దరూ గ్రామ శివారులో వెళ్తుండగా ఈరణగౌడ తమ్ముడి కుమారులు గుర్తించారు. వెంటనే అడ్డుకుని ఇద్దరినీ కిరాతకంగా చంపేశారు. తలపై బండరాళ్లను వేసి హతమార్చారు. ఆ తర్వాత పెదనాన్నను ఏ బీరుబాటిల్‌తో కొట్టిచంపారో అదే తరహాలోనే శవాల పక్కన ఉంచి ప్రతీకారం తీర్చుకున్నామని సంకేతం ఇచ్చేలా వ్యవహరించారు. నిందితులలో ఒకడు పట్టుబడగా మరొకరికోసం ప్రత్యేక బృందాలతో గాలింపులు జరుపుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఇంటికీ లబ్ధి: టీడీపీ

పెనుకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరుతుందని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆల్విన్‌కాలనీలో జీఎస్‌టీ తగ్గింపుపై ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రఘువీరచౌదరి, షౌకత్, నంజుండ, చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, జనసేన శ్రీదేవి పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సూపర్‌జీఎస్‌టీ సూపర్‌సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూటమినాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. మండల కన్వీనర్ ఈశ్వరప్రసాద్, పోతిరెడ్డి, కేశవయ్య, నారాయణస్వామి, వెంకటరాముడు, సూర్యనారాయణ, సోమశేఖర్, సిద్దయ్య పాల్గొన్నారు.

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతు సంఘం మండల నాయకుడు హరిక్రిష్ణ అన్నారు. జీఎస్‌టీ తగ్గింపువల్ల తాను బొలేరో వాహనం కొనగా రూ.లక్ష తగ్గినట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఉపశమనం కలిగిందన్నారు.

ఉళ్ళాలలో కావేరి పైపులైన్ పనులు



పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వృషభావతి వాటర్ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ఉళ్ళాల మెయిన్‌రోడ్డులో కావేరి నీటి సరఫరాకోసం పైపుల అమరిక పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల కొన్నిరోజులు వర్షాల కారణంగా అంతరాయం కలిగింది. తిరిగి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సమాజ సేవతో ఆదర్శం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తేజస్

మహదేవపుర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజసేవా కార్యక్రమాలతో క్రియాశీలకంగా ఉండడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉండాలని కన్నమంగల తేజస్ అభిప్రాయపడ్డారు. కన్నమంగల పంచాయతీలో పౌర కార్మికులకు మిఠాయిలు, దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమాలలోనూ పండ్లు, నిత్యావసరాలు సమకూర్చారు. ఈ సందర్భంగా తేజస్ మాట్లాడుతూ సమాజం కోసం ఎంతోకొంత సేవ అందించాలని, సాయం చేయడం ద్వారా మార్పు సాధ్యమన్నారు. రానున్న రోజుల్లో విద్య, పర్యావరణం, యువత బలోపేతం, రక్తదాన శిబిరాలు వంటి నిర్వహిస్తామన్నారు.

పచ్చదనం పెంపు లక్ష్యం



మొక్కకు నీరుపోస్తున్న మంత్రులు ఎంబీ పాటిల్, మునియప్ప

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరు హరళూరులో పచ్చదనం కోసం లక్ష మొక్కలతో అడవిని పెంచే కార్యక్రమానికి బ్రిగేడ్ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప మొక్కను నాటి కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. బ్రిగేడ్ ఫౌండేషన్ ట్రస్టీ, బ్రిగేడ్ గ్రూప్ అధ్యక్షుడు ఎంఆర్ జైశంకర్ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తుకు సమాజ సేవలో భాగంగా పచ్చదనం పెంచే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందుకు వనంతర సంస్థ సహకారం అందిస్తోందని అడవిని సృష్టించదలిచామన్నారు. ప్రత్యేక అతిథులుగా కేఎస్‌పీసీబీ అధ్యక్షుడు నరేంద్రస్వామి, బీఐఏపీఏ అధ్యక్షుడు శాంతకుమార్, కార్యదర్శి అంజుం పర్వేజ్, డాక్టర్ సెల్వకుమార్, ఎస్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కటైన గాయని సుహానా, నితిన్

బెంగళూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియాలిటీ షోలో ప్రజాదరణ పొందిన శివమొగ్గ జిల్లా సాగర్‌కు చెందిన సుహానా సయ్యద్, నాటక రంగ కళాకారుడు నితిన్ శివాంశ్ ఒక్కటయ్యారు. వేర్వేరు మతాలకు చెందినవారైనా 'కువెంపు' మంత్రమాంగల్యం విధానాలతో శుక్రవారం సరళంగా వివాహం చేసు కున్నారు. హిజాబ్ ధరించి హిందూ భజన చేసిన సుహానా పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వీటన్నింటిని పట్టించుకోని సుహానా హైస్కూల్‌లో చదివే కాలం నుంచి పరిచయం ఉన్న నితిన్‌తో కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. పెళ్లి సరళంగా చేసుకోవాలని నిర్ణయించుకున్నవారు అందుకు అనుగుణంగానే దంపతులు ఒక్కటయ్యారు. వధూవరులను పలువురు అభినందించారు.



సుహానా సయ్యద్, నితిన్ శివాంశ్